క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రమాదం తప్పినందుకు పూజలు



ఎంపీ మిథునరెడ్డిని ఆశీర్వదిస్తున్న తాళ్లపాక ఆలయాల అర్చకులు

రాజంపేట : రాజంపేట ఎంపీ, ప్యానల్ స్పీకర్ పీవీ మిథున్‌రెడ్డికి సోమవారం రాయచోటి బైపాస్‌లో త్రుటిలో రోడ్డు ప్రమాదం తప్పినందుకు తాళ్లపాకలో పూజలు నిర్వహించారు. మంగళవారం మేడాభవన్‌కు చేరుకున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తాళ్లపాక ఆలయాల అర్చకులు భక్తవత్సలం, మహేశ్ వేదమంత్రాలతో ఎంపీని ఆశీర్వదించారు.

వీధి లైట్లు వెలిగించండి

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని గువ్వలచెరువు, రామాపురం, సూర్యనారాయణపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు గత నాలుగు నెలల నుంచి వెలగడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రామాపురం, గువ్వలచెరువు గ్రామాల ప్రజలు పట్టణాలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లాలంటే చీకటిలో దారి తెలియక చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల దోపిడీని అరికట్టండి

రాయచోటి అర్బన్ : ప్రయాణికుల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ వసూలు చేస్తున్న చార్జీల దోపిడీని వెంటనే అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్రసహాయ కార్యదర్శి అంకన్న రవాణాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని అవకాశంగా తీసుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా టికెట్ల ధరలను పెంచేసిందన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని వెంటనే ప్రైవేటు బస్సులలో కూడా ఆర్టీసీతో సమానమైన చార్జీలనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా గోపగుడిపల్లె గుంటి గంగమ్మ జాతర

రామాపురం : మండలంలోని గోపగుడిపల్లె గుంటి గంగమ్మ తల్లి జాతర సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. మొక్కుబడి ఉన్నవారు చాందిని బండ్లను కట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు గ్రామం నుంచే కాకుండా మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో చాందిని బండ్లు కట్టడం విశేషం.

4న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైకు వచ్చే నెల 4న ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం 9 గంటలకు అల్ట్రా డీలక్స్ సర్వీసు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. దీంతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా నడుపుతామన్నారు. తిరువణ్ణామలైకు వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

రేపు చెరువుల వేలం

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట సచివాలయంలో గురువారం చేపలు పట్టుకోవడానికి చెరువుల వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచు వై.విజయమ్మ, కార్యదర్శి ఆజాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఆరు చెరువులకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు టోకన్ చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని సర్పంచ్ కోరారు.

టైలరింగ్, బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్ : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. 30 రోజులపాటు సాగే ఈ శిక్షణ ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానుందన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

21న ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : స్థానిక ఆర్టీసీ డిపో–2 ఆవరణంలో ఈనెల 21న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. లయన్స్ అభయ ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరంలో నారాయణ హృదయాల, ఆర్.ఎస్.జాలప్పకు చెందిన ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. 2డీ, ఏకో టెస్టులు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజంపేటకు మళ్లీ ‘ఐఏఎస్‌ల’ పాలన!

- నాడు సబ్ కలెక్టరేట్ నుంచి తెల్లదొరల రెవెన్యూ పాలన
- 14 ఎకరాల విస్తీర్ణంలో సబ్ కలెక్టరేట్
- సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అహమ్మద్‌ఖాన్



రాయచోటి రోడ్డులో ఉన్న రాజంపేట సబ్‌కలెక్టరేట్ (ఇన్‌సెట్) సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

రాజంపేట : నూతన జిల్లాగా ఆవిర్భవించిన అన్నమయ్య జిల్లాలో ఐఏఎస్‌ల పాలనలో రాజంపేట ఖ్యాతిని ఆర్జించింది. తెల్లదొరల పాలన నుంచి సబ్‌కలెక్టరేట్ కేంద్రంగా ఐఏఎస్‌ల పాలన కొనసాగింది. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకే రెవిన్యూశాఖ పరంగా తలమానికంగా రాజంపేట సబ్‌కలెక్టరేట్ నిలుస్తోంది. వైఎస్సార్ జిల్లాలో ఉన్నప్పుడు కడప కలెక్టరేట్, రాజంపేట సబ్‌కలెక్టరేట్ మాత్రమే కొనసాగాయి. 14 ఎకరాల విస్తీర్ణంలో సబ్‌కలెక్టరేట్ నిర్మితమైంది. ప్రత్యేకంగా సబ్‌కలెక్టర్ నివాస గృహం నిర్మితం చేశారు. అలాగే కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ ఉంది.

1915 నుంచి..

1915 నుంచి రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఉండేదని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ అంతకు ముందునుంచి బ్రిటీషు రెవెన్యూ పాలన కొనసాగింది. ఇందుకు సంబంధించి ఇప్పటికీ తెల్లదొరలు పాలన సాగించిన రెవెన్యూ భవనాలు ఇక్కడ కనిపిస్తాయి. ఆనాటి బ్రిటీషు కలెక్టర్ ప్రేమగా పెంచుకుంటున్న గుర్రం చనిపోతే, జ్ఞాపకంగా సమాధి కట్టించారు. ఇప్పటికీ అన్నమయ్య సభాభవనం సమీపంలో సమాధి కనిపిస్తుంది. భవనాల ఆధునికీకరణలో భాగంగా తెల్లదొరల జ్ఞాపకాలు కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి.

రెవెన్యూ పాలన చేసిన ఐఏఎస్‌లు ఎవరెవరంటే..

1953 నుంచి రాజంపేట డివిజన్ కేంద్రంగా చేసుకొని సబ్‌కలెక్టర్లుగా కె.రామచంద్రన్, ఎంఆర్‌పాయ్, టీఎల్ శంకర్, డీ.ఆరోరా, ఎ.వల్లవన్, శ్రీరామచంద్రమూర్తి, ఎంఎస్ రాజాజీ, సీఎస్ రంగాచారి, ఎస్.బాలకృష్ణ, బాబురాం, అశోక్ కుమార్ గోయల్, జానకి కృష్ణమూర్తి, శర్మారావు ఉన్నారు. 1978లో మిస్సీమాథ్యూస్, ఎంహెచ్‌డీ సఫీక్యూజ్ జామన్, రణదీప్ సదన్, ఏసీ పునీత, అజయ్‌జైన్, ప్రీతీమీనా, కేతన్‌గార్గ్ తదితరులు సబ్‌కలెక్టర్లుగా పనిచేశారు.

మళ్లీ సబ్‌కలెక్టర్ వచ్చేశారు..

రాజంపేట సబ్‌కలెక్టరేట్‌కు సబ్‌కలెక్టరుగా యువ ఐఏఎస్ అధికారి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను ప్రభుత్వం నియమిచింది. ఈయన 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. కాగా కేతన్‌గార్గ్ తర్వాత డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన కోదండరామిరెడ్డిని ఆర్డీఓగా నియమించారు. మళ్లీ ఈయన స్థానంలో ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది.

ప్రజలకు మెరుగైన సేవలే నాధ్యేయం

ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీవో కోదండరామిరెడ్డి నుంచి బాధ్యతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. రెవెన్యూ, లేదా మరే విషయంలోనైనా చట్టపరంగా ముందుకెళతానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన రాజంపేట సబ్ కలెక్టర్

రాయచోటి : రాజంపేట నూతన సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజంపేట నూతన సబ్ కలెక్టర్‌గా విధులలో చేరిన ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం డివిజన్‌కు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు.

ఉమ్మడి జిల్లాల క్రికెట్ విజేత రాజంపేట



క్రికెట్‌లో మొదటి బహుమతి కింద రూ. 1 లక్ష అందుకుంటున్న రాజంపేట జట్టు

పెనగలూరు : గత 15 రోజులుగా పెనగలూరులోని హైస్కూలు మైదానంలో నిర్వహించిన ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో రాజంపేట జట్టు విన్నర్‌గా, నందలూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు దేవూరు చిన్న వెంగల్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మొదటి బహుమతి రూ. 1 లక్ష, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ చిన్న వెంగల్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించేందుకే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్‌తోపాటు కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర పోటీల్లో గెలుపొందిన వారికి కూడా బహుమతులు అందజేశారు. వాలీబాల్ విన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ. 15 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ. 10 వేలు, తృతీయ బహుమతి కింద రూ. 5 వేలు నగదును అందజేశారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్‌లో యానాది టీమ్ విన్నర్‌గా నిలిచి రూ. 15 వేలు అందుకుంది. శివా టీమ్ రన్నర్‌గా నిలిచి రూ. 10 వేలు అందుకుంది. వాలీబాల్‌లో నారాయణ నెల్లూరు టీమ్ రూ. 15 వేలు, పెనగలూరు టీమ్ రూ. 10 వేలు, కబడ్డీలో ఇండ్లూరు యూత్‌కు రూ. 15 వేలు, సాతుపల్లి మహేష్ టీమ్‌కు రూ. 10 వేలు నగదు బహుమతి అందజేశారు. ఫుట్ బాల్‌లో విన్నర్‌గా నిలిచిన హరి టీమ్‌కు రూ. 15 వేలు, రన్నర్‌గా నిలిచిన గురు టీమ్‌కు రూ. 10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాకు శ్రీనివాసులు రెడ్డి, సిద్దవరం వెంకటేశ్వరరెడ్డి, ఈటమాపురం ప్రముఖ పారిశ్రామిక వేత్త బత్తిన గుండాల్ రెడ్డి, శంకర్ రెడ్డి, బండి సానారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవూరు పెద్ద వెంగల్ రెడ్డి, సూర్యశక్తి విత్తనాల కంపెనీ అధినేత విశ్వనాథరెడ్డి, పెనగలూరు మండల మాజీ వైస్ ప్రెసిడెంటు కె వెంకటరెడ్డి, పెంచలకోన మాజీ డైరెక్టర్ గణపతిరెడ్డి రంగారెడ్డి, గుడ్ల వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాకలో అన్నమాచార్య సంకీర్తనాలాపన



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న మహిళా భక్తులు

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలోని అన్నమయ్య ధ్యాన మందిరంలో మహిళలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ముందుగా అన్నమయ్య విగ్రహానికి పూజలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన అన్నమాచార్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో సంకీర్తనలు చేపట్టారు. అన్నమయ్యను స్మరించుకుంటూ ప్రతియేటా అన్నమయ్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సాయిలోకేష్, కంబాల శ్రీనివాసులు, సురేష్‌రాజు, షబ్బీర్ అహమ్మద్, గ్రామపెద్దలు అదృష్టదీపుడు, కొత్తపల్లి రమణయ్య పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత ఓబులవారిపల్లె జట్టు



టోర్నమెంట్‌లో విజయం సాధించిన జట్టుకు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన మండల స్థాయి డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను హోమ్ టీమ్ ఓబులవారిపల్లె జట్టు కైవసం చేసుకుంది. టోర్నమెంటులో దాదాపు 40 జట్లు పాల్గొనగా శనివారం నిర్వహించిన ఫైనల్‌లో ఓబులవారిపల్లె జట్టు నుంచి ఎం.శ్రీను, పి.తేజ, చెన్నరాజుపోడు జట్టు నుంచి మల్లి, ఆనంద్ తలపడ్డారు. ఓబులవారిపల్లె జట్టు విజయం సాధించింది. మండల కేంద్రానికి చెందిన షేక్ అజ్మత్ వలీ, పి.కార్తీక్ రెడ్డి, బండి హరికృష్ణలు గెలుపొందిన వారికి రూ. 7 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ. 5 వేలు నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె మండల యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు





సత్యమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు, ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయస్వామి

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతపల్లి జాతీయ రహదారిపై వెలసిన సత్యమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువ జాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకొని మహిళలు అమ్మవారిని దర్శించుకొని కాయా, కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో..

పుల్లంపేట: దళవాయిపల్లె గ్రామంలోని అభయాంజనేయస్వామికి పూజారి చిన్నా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు వేకువ జాము నుంచి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయా, కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

రైతు ఉత్పత్తి కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రవిచంద్ర బాబు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కుమ్మరవారిపల్లి సమీపంలో చేపడుతున్న రైతు ఉత్పత్తి సెంటర్ షెడ్డును అన్నమయ్య జిల్లా హార్టికల్చర్ అధికారి (డీహెచ్‌వో) రవిచంద్ర బాబు మంగళవారం పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారు పరస్పర సహాయక సహకార సంఘం ద్వారా రైతుల సౌకర్యార్థం రూ.15 లక్షల నిధులతో చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నాణ్యతగా పనులు జరగడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసారు. రైతులు పండించే వివిధ రకాల కూరగాయలు, ఇతర పంటలను సహకార సంఘం ద్వారా కొనుగోలు చేసి వాటిని ఇక్కడే గ్రేడింగ్ చేసి మార్కెటింగ్‌కు తరలిస్తామన్నారు. హార్టికల్చర్ క్లస్టర్ అధికారి ప్రతాప్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గంగాద్రి, ఎఫ్‌పీవో సీఈఓ రమ్య, రైతు సంఘం సభ్యులు సుదర్శన్, విశ్వనాథ్‌రెడ్డి, మారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక చెకుముకి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల పోస్టర్లను మంగళవారం కందుల గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ చంద్ర ఓబుల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 21, 22 తేదీల్లో కడప నగరంలో జరగనున్న చెకుముకి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల వివరాలను ఈ పోస్టర్‌లో ప్రచురించారు. ఈ సందర్భంగా చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచేందుకు జేవీవీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర రాహుల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించేందుకు జేవీవీ ఈ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకుని వారిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తే సమాజంలో ఆలోచన పరులుగా సరైన జ్ఞానంతో పెరుగుతాయన్నారు. తమ సంస్థ ప్రతి ఏడాది చెకుముకి సైన్స్ ఫెస్టివల్ పేరిట మెగా సైన్స్ ఈవెంట్‌ను పాఠశాల, మండలం, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తోందని, ఇందులో సైన్స్ జ్ఞానాన్ని పెంచేందుకు క్విజ్‌లు, పరీక్షలు, ప్రయోగాలుసహా అనేక వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న పక్కా గృహాలపై సమీక్ష

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న పక్కా గృహాలపై అధికారులతో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో పక్కా గృహాల కట్టడాలను పూర్తి చేసేందుకు ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. గ్రామ వలంటీర్లు కూడా జగనన్న గృహ నిర్మాణాలను త్వరగా కట్టుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక సర్పంచ్ జానకిరామయ్య జగనన్న కాలనీకి వెళ్లేందుకు మంజూరైన సీసీరోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారిని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ హరిత రాయబారులు తమ సమస్యలను మండల ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లారు ఆయన స్పందిస్తూ నాలుగు నెలల జీతాలు త్వరలో మంజూరవుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్ రావు, గ్రామ కార్యదర్శి లక్ష్మినరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక సంక్రాంతి

ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి చిదానంద్‌గౌడ్



భోజనం వడ్డిస్తున్న దాసరి చిదానంద్‌గౌడ్

రాజంపేట టౌన్ : హిందు, ముస్లింల ఐక్యతకు సంక్రాంతి ప్రతీక అని ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి చిదానంద్‌గౌడ్ పేర్కొన్నారు. సంక్రాంతి పార్వను పురస్కరించుకొని మంగళవారం ఆయన ఈడిగపాళెంలో ముస్లింలకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ హిందు, ముస్లింలు ఒక కుటుంబ సభ్యులుగా ఉంటారన్నారు. అందువల్ల ప్రతి ఏడాది ముస్లింలకు ఆత్మీయ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించుకొని హిందువులకు విందు ఇవ్వడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. ఇలాంటి మంచి సంప్రదాయం బహుశా మరెక్కడా ఉండదని తెలిపారు. ఎవరి పండుగైనా అందరు కలిసి, మెలసి భోజనం చేయడం వల్ల ఆత్మీయానుబంధాలు మరింత బలపడగలవన్నారు. తరతరాలుగా వస్తున్న ఇలాంటి ఐక్యత, మంచి వాతావరణం రాజంపేటలో శాశ్వతంగా కొనసాగుతుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. తొలుత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరులైన ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ సిద్దవటం మండలం ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిలు విందు కార్యక్రమంలో పాల్గొని చిదానంద్‌గౌడ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా, జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కౌన్సిలర్‌లు తంబా సుబ్రమణ్యం, పసుపులేటి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజామొహిద్దీన్, మురళీఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన అనకాపల్లి ఎంపీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : అనకాపల్లిలో ఈనెల 22న జరగనున్న తన కుమారుడి వివాహానికి రావాలని అనకాపల్లి ఎంపీ వెంకట సత్యవతి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని కోరారు. మంగళవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి కడపలోని ఆర్టీసీ చైర్మన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివాహ పత్రికను అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులకు పాదపూజ చేస్తున్న పూర్వవిద్యార్థులు

నందలూరు(రాజంపేట) : పాటూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో (1984–1985)బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తమ గురువులైన బాషామొహిద్దీన్, రాధాకృష్ణల పాదాలు కడిగి పాదాభివందనం చేసుకున్నారు. తమ గురుభక్తిని చాటుకున్నారు. గురువులకు బహుమతులను అందజేశారు. పూర్వవిద్యార్థులు మోహన్‌రెడ్డి, ఎల్లయ్య, శివయ్య, నరసరామయ్య, నాగవల్లి, పర్వీన్, సుబ్బమ్మ, ఖాసీంలు పాల్గొన్నారు. విద్యార్థి దశలోని తీపి గుర్తులను పరస్పరం గుర్తుచేసుకున్నారు.

5జీ టెక్నాలజీపై సర్వత్రా ఆసక్తి

– పూనే ప్రొఫెసర్ స్వప్నిల్ గౌల్



మాట్లాడుతున్న స్వప్నిల్ గౌల్

కురబలకోట : ప్రపంచంలో సర్వత్రా 5జీ టెక్నాలజీ పట్ల ఆసక్తి నెలకొందని, ఇది నూతన ఒరవడిని సృష్టించగలదని పూనే నుమెరిజిఎన్ పౌండర్ స్వప్నిల్ గౌల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కింద మైక్రోవేవ్ పాసివ్ సర్క్యూట్‌లు, డిజైన్ ఫ్యాబ్రికేషన్, మేజర్‌మెంట్స్‌పై ఆయన మాట్లాడుతూ 5జీ వైర్‌లెస్ టెక్నాలజీ అద్భుతంగా ఉండగలదన్నారు. మొబైల్ వినియోగదారులు వారి పరికరాలను, డేటాను అత్యంత వేగంగా డౌన్‌లోడు చేయగలదన్నారు. సమాచారం పంపడం, స్వీకరించడం జాప్యం లేకుండా సాగుతుందన్నారు. ప్రపంచంలో పలు దేశాలు 5జీ టెక్నాలజీ పట్ల ఎంతో ఆసక్తి కనపరుస్తున్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణకు ఆహ్వానం

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మదనపల్లెలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగులకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడునెలలు ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 18న జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ లో నమోదు చేసుకోవచ్చన్నారు. కోర్సులో 90 శాతం అటెండెన్స్ కలిగిన వారికి రూ.1,000 స్టైఫండ్ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9553202509 ఫోన్ నెంబర్‌పై సంప్రదించాలన్నారు.

అన్నసంతర్పణను విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె : మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్య కొండకు వచ్చే భక్తులకు శ్రీమల్లికార్జునస్వామి సోసియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే అన్నసంతర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కమిటీ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి కోరారు. మంగళవారం ఆదర్శ పాఠశాల ఆవరణంలో కమిటీ సమావేశం జరిగింది. అన్నసంతర్పణ ఏర్పాట్లు, నిర్వహణ, నిధుల సమీకరణ, జమాఖర్చులు తదితర అంశాలపై చర్చించారు. కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు నూతన కమిటీని ఎన్నుకునేందుకు తీర్మానించి ఆమోదించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బివి రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రమణారెడ్డి, కమిటీ సభ్యులు సహదేవ, రామూర్తి, శంకర్‌రెడ్డి, శివారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కమనీయం..శ్రీ లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని అకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

పెద్దమండ్యం: స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి సమాఖ్య సభ్యులు కృషి చేయాలని ఏపీఎం మధుబాబు అన్నారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఏపీఎం మాట్లాడుతూ ఆయా గ్రామ సమాఖ్యల పరిధిలో ఉన్న ఎస్‌హెచ్‌జిల అభివృద్ధికి సమాఖ్య సభ్యులు కృషి చేయాలన్నారు. సమావేశంలో గ్రామ సంఘాల పనితీరు, స్త్రీ నిధి రుణాలపై, సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపులపై సమీక్షించారు. సభ్యులు తీసుకున్న రుణం సకాలంలో తిరిగి చెల్లించేలా చూడాలన్నారు.